క్లుప్తంగా

దళితబంధు నిధులు విడుదల చేయాలి

హన్మకొండ అర్బన్ : రెండో విడత దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు కోకిల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దళితబంధు లబ్ధిదారులతో కలిసి హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మొదటి విడత రూ. 2 లక్షలు వేసి దళితబంధు లబ్ధిదారులకు న్యాయంచేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఎన్‌ఆర్‌ఐ విరాళం



మడికొండ: కాజీపేట మండలం రాంపూర్‌లో బుధవారం నుంచి బొడ్రాయి, భూలక్ష్మి, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరుగనున్నాయి. దీనికి గాను గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి రాంగోపాల్‌రావు కుమారుడు ఎన్‌ఆర్‌ఐ అరవింద్‌రావు మంగళవారం బొడ్రాయి కమిటీ సభ్యులకు రూ.5,20,116 చెక్కును అందజేశారు. బొడ్రాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గెస్ట్‌లెక్చరర్లను నియమించాలి

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో పాఠాలు బోధించేందుకు ఒక్క అధ్యాపకుడు కూడా లేరని దీంతో తాము నష్టపోతున్నామని కనీసం గెస్ట్‌లెక్చరర్లనైనా నియమించాలని కళాశాల మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయంలో ఏడీ రంగయ్యనాయుడికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఆయా విధులను నిర్వర్తించేందుకు అధ్యాపకులు ఎవరూ లేరని వెంటనే గెస్ట్ లెక్చరర్లనైనా నియమించాలని వారు కోరారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ లీగల్ : పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన క్లయింట్‌కు సంబంధించి కేసు విషయంపై చర్చిస్తున్న సమయంలో జనగామ సీఐ రఘుపతి, పోలీస్ సిబ్బంది అన్యాయంగా న్యాయవాద దంపతులైన గద్దల అమృతరావు-కవితలపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే సదరు సీఐ, పోలీస్ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

శాస్త్రోక్తంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు

ఖిలా వరంగల్ : ఖిలావరంగల్ మండలం అల్లీపురం గ్రామంలో ఈనెల 6 నుంచి 8వ వరకు జరుగనున్న పోచమ్మ, నాగమయ్య విగ్రహాల పునఃప్రతిష్ఠాపన పూజలు ఘనంగ ప్రారంభమయ్యాయి. వేదపండితులు వేదునూరి హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ నేతృత్వంలో మంగళవారం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే గణపతి పూజ, పుణ్యావాహచనము, రక్షబంధనం, అంకురార్పణ, పంచగవ్యప్రాక్షణ, యోగిని వాస్తు నవగ్రహారాధన, అగ్ని ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అనంతరం తర్వాత పోచమ్మ, నాగమయ్య విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఎదురేగి విగ్రహాలకు నీళ్లు పోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు.

ఆలయ ప్రవేశాన్ని నిషేధించడం సరికాదు

ఖిలా వరంగల్ : దళితులకు ధనమైసమ్మ ఆలయ ప్రవేశం కల్పించకుండా నిషేధించిన ఆలయ ప్రధాన కార్యదర్శి నాగరాజుపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంఘి ఏలేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం శివనగర మెట్లబావి ప్రాంగణంలోని ధనమైసమ్మ ఆలయం వద్ద దళితులకు ఆలయ ప్రవేశాన్ని నిషేధించిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని దళితసంఘాలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో నవీన్, ఠాకూర్ సునిత, సంధ్య, సుమల త, నర్సింగ్, రాము, మహేందర్ పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

కాశిబుగ్గ : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి అన్నారు. మంగళవారం వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్, గైనిక్ వైద్యులు శిరీష, పిల్లల వైద్యులు అశోక్‌కుమార్ తల్లులకు అవగాహన కల్పించారు. ఆరునెలల వరకు తల్లిపాలు తప్ప ఏ ద్రవపదార్థాలు తాగించకూడదన్నారు.

అన్నదానం

హన్మకొండ అర్బన్ : టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా సుబేదారిలోని బాలసదనంలోని పిల్లలకు అన్నదానం, స్వీట్లు పంపిణీ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో టీఎన్జీవోస్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యకుడు రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

డివిజన్‌లో సమస్యల తిష్ట

- గుంతలమయంగా ప్రధాన రహదారి
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ



శంకుస్థాపన చేసినా రోడ్డు పడని రాయపురలోని వైస్రాయ్ బార్ గల్లీ



మారెమ్మ చెట్టు వద్ద అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని 10వ డివిజన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాల లేమితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో రెండేళ్లు అయితే పదవీ కాలం ముగుస్తున్నప్పటికీ వసతుల కల్పనలో కార్పొరేటర్ విఫలమయ్యాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్పొరేటర్ పలు సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 10వ డివిజన్‌లో రాజ్‌పుత్‌వాడ, మచిలీబజార్, రాయపుర, బెస్తవాడ, కాపువాడ, పద్మాక్షికాలనీలు ఉన్నాయి. సుమారు 15 వేల పైచిలుకు జనాభా కల్గిన డివిజన్‌లో 10వేల వరకు ఓటర్లు ఉన్నారు. డివిజన్‌లో అత్యధికంగా విద్యావంతులు ఉంటున్నప్పటికీ మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా నివసిస్తున్నారు. హనుమకొండ బస్టాండ్ రోడ్‌లోని పద్మాక్షి ఆలయానికి వెళ్లే మలుపు నుంచి అలంకార్ జంక్షన్‌కు వెళ్లే ప్రధాన దారిలో అడుగుకో గుంత దర్శనమిస్తుంది. గత దశాబ్దకాలంగా ఈ రోడ్డును పట్టించుకున్న నాథులే లేరని స్థానికులు వాపోతున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం అలంకార్ జంక్షన్ నుంచి వేయిస్తంభాల గుడి వెనకాల వరకు రోడ్డు నాసిరకంతో వేయగా వేసిన రెండేళ్లకే పాడైంది. మచిలీబజార్‌లోని మారెమ్మ చెట్టు ప్రాంతంలో సైడ్ డ్రెయినేజీ అధ్వానంగా మారడంతో మురుగునీరు రోడ్డు పైకి చేరుతుంది. వాహనదారులు, పాదచారులు అటుగా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. మచిలీబజార్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వెనకాల గల్లీల్లో డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. ముస్లిం మైనారిటీలు ఎక్కువగా ఉండే రాయపురలో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను పట్టించుకున్న దాఖలాలు లేవు. వైస్రాయ్ బార్ నుంచి లోపలికి సీసీ రోడ్డు నిర్మాణం కోసం సుమారు ఆరు నెలల క్రితం శంకుస్థాపనలు చేశారు. పట్టణ ప్రగతిలో భాగంగా సుమారు రూ.70 లక్షలతో సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీపై స్లాబ్ పనుల కోసమంటూ గత ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రెండుసార్లు కొబ్బరికాయలు కొట్టారు. ప్రస్తుతం నిధులు మంజూరు లేక వాటితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మచిలీబజార్ నుంచి అలంకార్ వరకు గల రోడ్డు గుంతలమయం కావడంతో నాలుగు రోజుల క్రితం ప్యాచ్ వర్క్‌లు చేపట్టారు. కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే అధికారులు రోడ్డు మరమ్మతులు చేపడుతున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు.

మురికి కాల్వలు తీయడం లేదు



మా గల్లీల మురికి కాల్వలు తీయక నెల రోజులవుతోంది. చెత్త నిండి వర్షం నీటిలో కుళ్లి వాసన వస్తుంది. మురుగుతో దోమలు పెరిగి రాత్రి, పగలు తేడా లేకుండా కుడుతున్నాయి. మున్సిపాలిటీ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా ఇటువైపు వచ్చిన వారే లేరు.

– పులి లక్ష్మి, మచిలీబజార్

ప్రతిపాదనలు అందజేశా



డివిజన్‌లో 15 ఏళ్ల క్రితం వేసిన రోడ్లు, డ్రెయినేజీలు అన్నీ దీనావస్థలో ఉన్నాయి. మచిలీబజార్ మారెమ్మ చెట్టు నుంచి అలంకార్ జంక్షన్ వరకు పలు అభివృద్ధి పనులకు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి అధికారులకు అందజేశాను.

– తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్

మొక్కలు నాటి సంరక్షించాలి

మడికొండ: మొక్కలు నాటడమే కాదు వాటిని ప్రతిరోజు పరిశీలించి నీటిని పోయాలని స్థానిక సీఐ ప్రతాప్ సిబ్బందికి సూచించారు. మడికొండ పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు.

కాశిబుగ్గ : స్వచ్ఛమైన తాగునీటితోనే ఆరోగ్యంగా ఉంటామని వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని 20వ డివిజన్ కార్పొరేటర్ నరేంద్రకుమార్ సూచించారు. మంగళవా రం కాశిబుగ్గలోని వాటర్‌ట్యాంక్‌లను పరిశీలించారు.

రామన్నపేట : ఫిల్టర్‌బెడ్‌లోని వాటర్ టెస్టింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏదైనా లోపాలు ఉంటే వెంటనే సవరించాలని 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్‌లోని ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్‌ను సందర్శించారు.

మనల్ని మనం రక్షించుకోవాలి

ఖిలా వరంగల్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పై మనల్ని మనమే రక్షించుకోవాలని కార్పొరేటర్లు ముస్కమల్ల అరుణ, మరుపల్లి రవి, బైరబోయిన ఉమ, దిడ్డి కుమారస్వామి, వేల్పుగొండ సువర్ణ, పోశాల పద్మ సూచించారు. వరంగల్ 33, 34, 37, 38, 40, 41 డివిజన్లలో మున్సిపల్ మలేరియా అధికారుల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఇంటి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఖిలావరంగల్ : శివనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి

హసన్‌పర్తి : నాటిన మొక్కలను సంరక్షించాలని మండల పరిషత్ పంచాయతీ అధికారి కర్ణాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగారం, పెంబర్తి పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు.

గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు

కాజీపేట అర్బన్ : 31వ డివిజన్‌లోని కోట చెరువులోని గుర్రపు డెక్కను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ మామిండ్ల రాజు అధికారులకు సూచించారు. గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు డ్రెయినేజీ మురుగు నీరు కలవకుండా చర్యలు చేపట్టాలన్నారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శిగా యాదగిరి



వరంగల్: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శిగా అక్కెనపల్లి యాదగిరిని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా, నాయకులు రొయ్యల రాజు, గోల్కొండ కుమార్ తెలిపారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ విస్తృతస్థాయి సమావేశం పైడిపల్లి కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్‌నగర్ గౌరవ అధ్యక్షుడిగా రవిరాకుల ప్రసంగి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్‌గా సిలువేరు సుస్మిత, బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ జిల్లా కన్వీనర్‌గా జన్ను ప్రవీణ్, యువజన సంఘం జిల్లా నాయకులుగా చిట్టి, సుబ్బు, అఖిల్, గీసుకొండ మండల కన్వీనర్‌గా కంది రవి, సంగెం మండల కన్వీనర్‌గా పోలేబోయిన శ్రీనివాస్, వరంగల్ మండల కన్వీనర్‌గా పట్టెం మొగిలి, కాశిబుగ్గ ఏరియా కార్యదర్శిగా ఎనుగంటి రాజలింగం, పర్వతగిరి మండల కన్వీనర్‌గా ఎస్కే పాషా, న ర్సంపేట మండల కన్వీ నర్‌గా శివకుమార్, వర్ధన్నపేట మండల కన్వీనర్‌గా సత్యం ట్రాలీ అండ్ ట్రాన్స్‌పోర్ట్ రంగం జిల్లా కన్వీనర్‌గా రాజు, ఆటో జిల్లా కన్వీనర్‌గా గౌస్‌పాషాలను ఎన్నుకున్నారు.

సంక్షిప్త సమాచారం

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హన్మకొండ అర్బన్ : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల అన్నారు. మంగళవారం నగరంలోని బాలసముద్రంలోని బ్యూటీషియన్ ట్రెనింగ్ సెంటర్‌లోని మహిళలకు చట్టాలు, సఖి కేంద్రం అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పించారు. మహిళలు సమస్యల్లో ఉన్నప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్ 181 లేదా 0870 2452112 నంబర్‌కు కాల్ చేస్తే బాధిత మహిళలకు తక్షణసాయం అందుతుందని సూచించారు.

మోటారు ధ్వంసం

హసన్‌పర్తి: తన వ్యవసాయ బావిలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీతంపేటకు చెందిన సారయ్య కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానిస్తున్న సదానందం, రాజు,అక్షయ్, పురంజిత్, బాలుపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్ తెలిపారు.

నాగుల పంచమి పూజల్లో పాల్గొనండి

హన్మకొండ కల్చరల్ : వరంగల్ ఉర్సు శ్రీనాగేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 9న శ్రావణశుద్ధ పంచమి తిథి శుక్రవారం నాగుల పంచమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈఓ ప్రసాద్ కోరారు. మంగళవారం ఆలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ..హెచ్‌ఎంకు తీవ్రగాయాలు

ఖిలా వరంగల్: లారీ అదుపు తప్పి బైక్‌ను ఢీకొనడంతో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం లారీ ముందు టైర్ కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట జంక్షన్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కాజీపేటకు చెందిన బయ్య విద్యాసాగర్(55) ఖిలావరంగల్ మండలం శివారు గుంటూరుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నాడు. రోజువారీగానే మంగళవారం సాయంత్రం స్కూల్‌లో విధులు ముగించుకుని బైక్‌పై బైక్‌పై గుంటూరుపల్లి నుంచి కాజీపేటకు బయల్దేరాడు. వరంగల్ ఉర్సుగుట్ట జంక్షన్ టర్నింగ్ సర్కిల్‌లో లారీ అదుపు తప్పి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ ముందు టైర్ కింద పడడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుని ఎంజీఎంకు తరలించారు. ఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని ప్రమాదానికి గల కారణాలను సేకరించినట్లు తెలిసింది.

ర్యాగింగ్ పేరిట కొట్టారు..
పోలీస్‌స్టేషన్‌లో బాధిత విద్యార్థి ఫిర్యాదు

హసన్‌పర్తి: వరంగల్ నగర శివారులోని ఓ విద్యాసంస్థలో ర్యాగింగ్ పేరిట విద్యార్థిని తీవ్రంగా కొట్టారు. అవమానానికి గురైన ఆ విద్యార్థి మంగళవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని జూలైవాడ బృందావన్‌కాలనీకి చెందిన జాటోతు దిలీప్‌కుమార్ నగర శివారులోని ఓ విద్యాసంస్థలో బీబీఎం సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో పలువురు సీనియర్ విద్యార్థులు.. దిలీప్‌కుమార్‌ను ర్యాగింగ్ పేరిట హింసించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

గుట్కా వ్యాపారి అరెస్ట్

హసన్‌పర్తి: గుట్కాలు విక్రయిస్తున్న ఓ వ్యాపారిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.6,818 విలువైన గుట్కాలు స్వాధీన చేసుకున్నామని స్థానిక పోలీస్ సీఐ సురేశ్ తెలిపారు.

నిధులు కేటాయించాలి

కాశిబుగ్గ : కాంగ్రెస్ ఎన్నికల ముందు చెప్పిన విధంగా చేవేళ్ల ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ స భ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో వరంగల్ తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం చేపట్టే నిరసనకు తూర్పులోని జిల్లా నాయకులు, కార్యకర్తలు తరలిరా వాలన్నారు.

'అంతే'తో ఫీజులో రాయితీ

హన్మకొండ: ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ (అంతే)తో నగదు అవార్డుతో పాటు 100 శాతం స్కాలర్‌షిప్ పొందవచ్చని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ రీజినల్ సేల్స్ అండ్ గ్రోత్ హెడ్ ఎం.భరత్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ అమిత్ అన్నారు. మంగళవారం హనుమకొండ అంబేద్కర్ కూడలిలోని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంతే-2024 జాతీయ స్కాలర్ షిప్ పరీక్ష అక్టోబర్‌లో జరుగుతుందన్నారు. 8 నుంచి 12వ తరగతి విద్యార్థులకు నగదు అవార్డుతో పాటు, 100 శాతం స్కాలర్‌షిప్ పొందే అవకాశాన్ని కల్పించేందుకు టాలెంట్ హబ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకుంటే దరఖాస్తు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: కాజీపేటలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, చైతన్యపురి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చె ప్పారు.

గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

హన్మకొండ కల్చరల్ : కాళోజీ కళాక్షేత్రం ఆవరణలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని డీఎంఎస్‌ఏ అధ్యక్షుడు దూడపాక నరేశ్ డిమాండ్ చేశారు. గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం డీఎంఎస్‌ఏ, టీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం అవరణలో గద్దర్ చిత్రపటానికి పూలతో అభిషేకం చేసి నివాళులు అర్పించారు.ఓయూఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు దూడపాక సురేశ్, తాడిశెట్టి క్రాంతి, రోహన్, ఠాగూర్, శ్రీను పాల్గొన్నారు.

పీడిత ప్రజల గొంతుక గద్దర్

కాశిబుగ్గ : పీడిత ప్రజల గొంతుక ప్రజా యుద్ధనౌక గద్దర్ అని సామాజిక ప్రజా కవుల కళాకారుల స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గడ్డం శరత్ కొనియడారు. మంగళవారం రాత్రి వారి ఆధ్వర్యంలో చూండూరి దళిత మృతవీరుల దినం, జహీర్‌ఖాన్, గద్దర్‌ల యాది సభను వరంగల్ క్రిస్టియన్‌కాలనీలో ఘనంగా నిర్వహించారు.

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్డు కమిటీ అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ ఎదుట మంగళవారం తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్ వర్ధంతి సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

హన్మకొండ: గద్దర్‌కు కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, నాయకులు నివాళులర్పించారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కేయూ క్యాంపస్: కేయూలోని హాస్టళ్లలో పలు సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం రిజిస్ట్రార్ కార్యాలయంలో ధర్నా చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కేయూ అధ్యక్షుడు పురుషోత్తమ్, సాయికుమార్, జశ్వంత్, పాల్గొన్నారు.

'శ్వేతార్క'లో గణపతి దీక్షలు ప్రారంభం

కాజీపేట: కాజీపేట స్వయంభు శ్రీశ్వేతార్కమూల గణపతి దివ్య క్షేత్రంలో మంగళవారం గణపతి మండల దీక్షలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లుశర్మ లాంఛనంగా ప్రారంభించారు. 20 మందికి ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ మాలలు వేశారు.

తమలపాకులతో అంజన్నకు పూజలు

కాజీపేట : 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణముఖ అభయాంజనేయ స్వామికి మంగళవారం తమలపాకులతో ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి నిత్యపూజలు జరిపించారు.

కాశిబుగ్గ : ఓ సిటీ రోడ్డులో శ్రీ సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప, ఓంకారేశ్వర, సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయంలోని హనుమాన్‌కు 5,116 వడలతో పూజలు చేశారు.

మూట బేరగాళ్లను నేతకార్మికులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న వడ్నాల నరేందర్

హసన్‌పర్తి : పద్మశాలి మూట బేరగాళ్లను నేత కార్మికులుగా గుర్తించి వారి సంక్షేమానికి బాటలు వేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్ కోరారు. సంఘం తొలి జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నగరంలోని ఓ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి నరేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సరైన ఉపాధి లేక నేతకార్మికుల వలసలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజగోపాల్, తౌటం రవీందర్, బొప్ప శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సట్కూరి సంతోష్, ఉపాధ్యక్షుడు నల్లా సత్యనారాయణ, పోరండ్ల రమేష్, వేణుగోపాల్, తుమ్మ శోభన్‌బాబు, ప్రచార కార్యదర్శి పులికంటి రాజేందర్, పాల్గొన్నారు.

కాలానుగుణంగా జర్నలిజంలో మార్పులు

నయీంనగర్ : మారుతున్న కాలాన్ని బట్టి జర్నలిజంలో కూడా మార్పులు సంభవిస్తున్నాయని ఇండియా టుడే పూర్వ ప్రతినిధి, మల్టీమీడియా ఇండిపెండెంట్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, డాక్టర్ ఎస్.వెంకటనారాయణ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన వెంకటనారాయణ జర్నలిస్టులతో చిట్‌చాట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాల గురించి తనదైన శైలిలో వివరించారు. అన్ని రంగాల్లో ప్రపంచంలోనే కీలక శక్తిగా భారత్ ఎదుగుతుందన్నారు. అనంతరం వెంకటనారాయణను ప్రెస్‌క్లబ్ కార్యవర్గం శాలువాతో సత్కరించి, మెమొంటో అందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి అమర్, పూర్వ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, పిన్నా శివకుమార్, పీవీ మదన్ మోహన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.



వెంకటనారాయణను సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, జర్నలిస్టులు

వరద బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

వరంగల్ : కేరళ రాష్ట్రంలో జరిగిన ప్రకృతి విలయ తాండవంలో నిరాశ్రయులైన వాయినాడ్ బాధితులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బుస్సు రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం బాధితుల కోసం వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో మేరకు వ్యాపారస్తుల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఎండీ.కాసిం, నాయకులు తల్లపల్లి రాయల, అశోక్, రమేశ్, స్వప్న, మనోహర్, సామెల్, అంజాద్, లక్ష్మీ, మల్లయ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ అర్బన్: నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



కాజీపేట : కాజీపేట చౌరస్తాలో



హన్మకొండ : బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో..



ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన కృషి, పట్టుదల అందరికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. జయశంకర్ 90 జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మేధావులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు – సాక్షి నెట్‌వర్క్



హన్మకొండ కల్చరల్ : వోపాస్ ఆధ్వర్యంలో..



హసన్‌పర్తిలో..



రామన్నపేట : డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో..



వరంగల్ అర్బన్ : కౌన్సిలింగ్ హాల్‌లో..



కాళోజీసెంటర్‌లో..



కాశిబుగ్గ : జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో..



కేయూ క్యాంపస్: ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీలో..



హన్మకొండ కల్చరల్ : నివాళులర్పిస్తున్న పీఠాధిపతి బాబురావు



జిల్లా కోర్టు ప్రాంగణంలో..



కాజీపేట అర్బన్ : జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు